క్లుప్తంగా

జానకీమాత జీవితం ఆదర్శప్రాయం



ఆధ్యాత్మిక ప్రసంగం చేస్తున్న సాయికుమార్

శ్రీకాకుళం కల్చరల్: శ్రీరాముడి ధర్మపత్ని జానకిమాత నేటితరానికి ఆదర్శంగా నిలుస్తారని రంప సాయికుమార్ అన్నారు. నగరంలోని ఉపనిషన్మందిరంలో జరుగుతున్న శ్రీరామ వసంత నవరాత్రి ఉత్సవాలలో భాగంగా 'జానకీమాత పాతివ్రత్యం–నేటి యువతకు సందేశం' అనే అంశంపై గురువారం ప్రసంగించారు. రావణాసురుడు ఎన్ని ప్రలోభాలు పెట్టినా దేనికీ లొంగకుండా, చివరి వరకు తన పాతివ్రత్యాన్ని కొనసాగించారని చెప్పారు. కార్యక్రమంలో సభ్యులు కె.సుధీర్, శ్రీనివాసరావు, సూర్యారావు, సనపల నారాయణమూర్తి, భాస్కరభట్ల నరసయ్య, కామేశ్వరరావు, విశ్వేశ్వరరావు, సరస్వతి, జగదాంబ, అనురాధ, లక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

ఆటిజం లక్షణాలను సకాలంలో గుర్తించాలి



అవగాహన కల్పిస్తున్న సిబ్బంది

శ్రీకాకుళం కల్చరల్: ఆటిజం వ్యాధి కాదని, రుగ్మత అని, సకాలంలో లక్షణాలు గుర్తిస్తే నయం చేయవచ్చని రెడ్‌క్రాస్ చైర్మన్ పి.జగన్మోహనరావు అన్నారు. జిల్లా కేంద్రంలోని రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో ఆటిజం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెండేళ్లలోపు పిల్లలకు లక్షణాలు గుర్తించి సరైన వైద్యం, చికిత్స అందిస్తే సంపూర్ణ విజ్ఞానవంతులుగా మారుతారని చెప్పారు. ఆటిజం లక్షణాలు, చికిత్స ప్రక్రియను డాక్టర్ కె.ఉదయ్‌కుమార్, కె.సాయి శిరీషలు వివరించారు. అనంతరం ఆటిజం పిల్లలకు ఆటలు పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ కమిటీ సభ్యులు కనుగులు దుర్గా శ్రీనివాస్, డాక్టర్ నిక్కు అప్పన్న, ఎం.కల్యాణ్ చక్రవర్తి, బి.చిన్నారావు, కల్యాణ్, పి.వైకుంఠరావు, రూపవతి, ధనలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

బాల్ బ్యాడ్మింటన్‌కు పూర్వ వైభవం

శ్రీకాకుళం న్యూకాలనీ: బాల్ బ్యాడ్మింటన్‌కు జాతీయ హోదా పునరుద్ధరించి, క్రీడ పూర్వ వైభవానికి కృషి చేయాలని జిల్లా బాల్ బ్యాడ్మింటన్ ఉపాధ్యక్షుడు రుప్ప రమణమూర్తి కోరారు. ఈ మేరకు గురువారం విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడును ఢిల్లీలోని ఆయన క్యాంపు కార్యాలయంలో కలిసి వినతిపత్రం అందజేశారు. క్రీడా మంత్రిత్వశాఖ టెన్నిస్ బాల్, క్రికెట్, సైకిల్‌పోలో, అత్యపాట్య, టెన్నిస్, వాలీబాల్, ఖోఖో, మాల్కోంబ్ వంటి స్వదేశీ క్రీడలకు జాతీయ గుర్తింపు ఇచ్చినప్పుడు బాల్ బ్యాడ్మింటన్‌ను విస్మరించడం తగదన్నారు.

డ్రంక్ అండ్ డ్రైవ్ నిందితుడికి రిమాండ్

శ్రీకాకుళం క్రైమ్: జిల్లాకేంద్రంలోని ఏడురోడ్ల కూడలిలో బుధవారం రాత్రి డ్రంక్ అండ్ డ్రైవ్‌లో పట్టుబడిన ఎచ్చెర్ల మండలం గొల్లపేట గ్రామానికి చెందిన బత్తుల గోవిందరావును గురువారం రిమాండ్‌కు తరలించినట్లు ట్రాఫిక్ సీఐ నాగరాజు తెలిపారు. నిందితుడిని జిల్లా సెకెండ్‌క్లాస్ మెజిస్ట్రేట్ కె.శివరామకృష్ణ వద్ద హాజరుపర్చగా 20 రోజుల రిమాండ్ విధించారని పేర్కొన్నారు.

ఉచిత శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

పాతపట్నం: గ్రామీణ ప్రాంత నిరుద్యోగులకు అమ్మ చారిటబుల్ ట్రస్ట్ సెంటర్ ఆధ్వర్యంలో వివిధ కోర్సుల్లో ఉచిత శిక్షణ ఇవ్వనున్నారు. ఈ మేరకు ట్రస్ట్ ఇన్‌చార్జి ఎం.చంద్రరావు, కోఆర్డినేటర్ డి.దాశరధి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పాతపట్నం రైల్వే స్టేషన్ సమీపంలో ఉన్న వైటీసీలో నాలుగు నెలలపాటు శిక్షణ ఉంటుందన్నారు. కంప్యూటర్ బేసిక్స్, ఎం.ఎస్.ఆఫీస్, స్పోకెన్ ఇంగ్లిష్, పర్సనల్ డవలప్‌మెంట్ స్కిల్స్, సోలార్ పీవీ ఇన్‌స్టాలేషన్ కోర్సులకు ఈ నెల 5వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. పదో తరగతి పాసై ఉండాలని, 18 నుంచి 35 ఏళ్ల వయస్సువారు పురుష అభ్యర్థులు మాత్రమే అర్హులన్నారు. ఉచితంగా హాస్టల్, వసతి సౌకర్యం ఉంటుందన్నారు. 105 సీట్లు మాత్రమే ఉన్నాయని, పూర్తి వివరాలకు ఫోన్ 9963646329, 9704268093 నంబర్లను సంప్రదించాలన్నారు.

ప్రవేశ పరీక్ష తేదీ మార్పు

బూర్జ: కొల్లివలస డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ గురుకుల విద్యాలయంలో 2025–26లో 5వ తరగతి, ఇంటర్మీడియెట్ మొదటి సంవత్సరం (ఇంగ్లిష్ మీడియం)లో ప్రవేశానికి ముందుగా ప్రకటించిన ప్రవేశ పరీక్ష తేదీని మార్పు చేశారు. ఈ మేరకు కళాశాల ప్రిన్సిపాల్ డి.దేవేంద్రరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 6వ తేదీన జరగాల్సిన ప్రవేశ పరీక్ష ఈ నెల 13వ తేదీకి మార్పు చేయడం జరిగిందన్నారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు 5వ తరగతి, మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు ఇంటర్మీడియెట్ విద్యార్థులకు ప్రవేశ పరీక్షలు నిర్వహిస్తామన్నారు.

చేతులెత్తేసిన ప్రభుత్వం..

చేయూతనిస్తున్న దాతలు

- రిమ్స్‌కు పరికరాల ప్రతిపాదనపై స్పందించని కూటమి సర్కారు
- సామగ్రి అందించేందుకు ముందుకు వస్తున్న ప్రైవేటు సంస్థలు
- ఎంపీసీఐఎల్ సంస్థ ద్వారా రూ.1.16 కోట్లతో పరికరాలు
- డాక్టర్స్ ఫర్ యూ సంస్థ ద్వారా రూ.50 లక్షల విలువైన వస్తువులు



జిల్లా కేంద్రంలోని రిమ్స్ ఆస్పత్రి

శ్రీకాకుళం: జిల్లా కేంద్రంలోని రిమ్స్ వైద్య కళాశాలకు దాతలే దిక్కయ్యారు. వైద్య పరికరాలు, ఇతర మౌలిక వసతుల కల్పనకు ఎన్నిసార్లు ప్రతిపాదనలు పంపినా ప్రభుత్వం స్పందించకపోవడంతో ప్రైవేటు సంస్థలే దాతృత్వం కనబరిచి పరికరాలు ఇచ్చేందుకు ముందుకొస్తున్నాయి. అత్యంత వెనుకబడిన జిల్లాగా పేరుగాంచిన శ్రీకాకుళం జిల్లాకు దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వై.ఎస్.రాజశేఖరరెడ్డి రిమ్స్ వైద్య కళాశాలను మంజూరు చేసిన విషయం తెలిసిందే. ఆయన మరణానంతరం వచ్చిన కాంగ్రెస్, తెలుగుదేశం ప్రభుత్వాలు కళాశాల అభివృద్ధిని కనీసం పట్టించుకోలేదు. దీంతో కళాశాల అనుబంధంగా రావాల్సిన పారా మెడికల్ కోర్సులు, బీఎస్సీ నర్సింగ్ కోర్సులు మంజూరు కాలేదు. పీజీ సీట్లు కూడా 19కే పరిమితమయ్యాయి. అయితే వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత వైద్య రంగంపై ప్రత్యేక దృష్టి సారించారు. శ్రీకాకుళం రిమ్స్‌లో అదనపు సౌకర్యాలు కల్పించడంతో పాటు 50 వరకు ఎంబీబీఎస్ సీట్లు మంజూరయ్యాయి. 60 వరకు అదనంగా పీజీ సీట్లు మంజూరయ్యాయి. పారామెడికల్ కోర్సులు, బీఎస్సీ నర్సింగ్ కోర్సులు కూడా జగన్ హయాంలోనే ప్రారంభమయ్యాయి. పేద ప్రజలకు అందులోనూ వెనుకబడిన శ్రీకాకుళం జిల్లా ప్రజలకు ప్రభుత్వ ఆసుపత్రిలోనే సూపర్ స్పెషాలిటీ సేవలు అందించాలన్న ఉద్దేశంతో న్యూరాలజీ, ఆంకాలజీ, యూరాలజీ, నెఫ్రాలజీ వంటి ఐదు సూపర్ స్పెషాలిటీ విభాగాలు కూడా పోస్టులతో సహా మంజూరు చేశారు.

గాలికొదిలేసిన కూటమి సర్కారు

దాతలు స్పందించి అన్ని రకాలుగా సహాయ సహకారాలు అందించేందుకు ముందుకు వచ్చారే తప్ప ప్రభుత్వంలో మాత్రం చలనం కన్పించలేదు. రిమ్స్ ఆస్పత్రికి అవసరమైన పరికరాలు, ఇతర వస్తువులను సరఫరా చేయాలని కోరుతూ రూ.9 కోట్లతో అంచనాలు రూపొందించి ప్రభుత్వానికి నివేదించారు. ఇది జరిగి నాలుగు నెలలకు పైబడుతున్నా కనీసం ఒక్క వస్తువు సరఫరా చేయలేదు సరికదా మందులు కూడా అందుబాటులో ఉంచలేని పరిస్థితికి తీసుకొచ్చింది. మరోవైపు వైద్య కళాశాలలు, ఆస్పత్రులను ప్రైవేటీకరించాలని ప్రస్తుత ప్రభుత్వం యోచిస్తున్నట్లు వార్తలు వస్తుండటం ప్రభుత్వ ఆసుపత్రుల్లో సరైన సౌకర్యాలు కల్పించకపోవడం వంటివి పరిగణనలోకి తీసుకుంటే అది వాస్తవమేనననిపిస్తోంది.

దాతలు దిగి వచ్చిన వేళ..

ఈలోగా ఎన్నికలు రావడం కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో రిమ్స్ పరిస్థితి మళ్లీ మొదటికి వచ్చింది. రిమ్స్‌లో ఉన్న సౌకర్యాల లేమిపై 'సాక్షి'లో కథనాలు ప్రచురితం కావడంతో దాతలు ముందుకొచ్చారు.

- ఎంపీసీఐఎల్ సంస్థ ఐదు సూపర్ స్పెషాలిటీ విభాగాలకు అవసరమైన పరికరాలను రూ.1.16 కోట్లతో అందిస్తామని ముందుకొచ్చింది. ఇందులో హృద్రోగులు, క్యాన్సర్, కిడ్నీ రోగులకు అవసరమైన ఎన్నో పరికరాలున్నాయి.
- యూనియన్ బ్యాంకు రూ.50 లక్షలతో రక్తనిధికి రెండు ఫ్రీజర్లు అందించేందుకు ముందుకొచ్చింది.
- డాక్టర్స్ ఫర్ యు సంస్థ రూ.50 లక్షలతో ఆపరేషన్ థియేటర్లలో పరికరాలు స్టెరిలైజేషన్ వినియోగించే పరికరాలతో పాటు అక్కడ వినియోగించే దుస్తులు శుభ్రపరిచేందుకు, ల్యాబ్‌లో వినియోగించే దుప్పట్లు, ఇతర వస్త్రాలు శుభ్రపరిచేందుకు వాషర్లు, డ్రైయర్లు, స్టెరిలైజర్లు అందించేందుకు అంగీకారం తెలిపింది.
- హెచ్‌పీసీయల్ సంస్థ రెండు ఆర్వో ప్లాంట్లు అందించేందుకు ముందుకొచ్చింది.

ఎవరిచ్చినా మంచిదే...

ఆస్పత్రికి పరికరాలు, వస్తువులు ఎవరిచ్చినా అవి రోగులకు ఉపయోగపడతాయి. వస్తువులు ఎవరిచ్చారని మేం చూడం. మంచి సేవలందించడమే మా లక్ష్యం. కలెక్టర్ చొరవతో దాతలు ముందుకురావడం ఆనందంగా ఉంది.

– డాక్టర్ షకీలా, సూపరింటెండెంట్, రిమ్స్

సాగునీటి సమస్య పరిష్కరించాలి



నారాయణపురం ప్రాజెక్టును పరిశీలిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు, ప్రజా ప్రతినిధులు

ఎచ్చెర్ల క్యాంపస్: ఎచ్చెర్ల మండలంలో 13 గ్రామ పంచాయతీల పరిధిలో 7500 ఎకరాలకు సాగునీరు అందించే నారాయణపురం కుడికాలువ శివారు ఆయకట్టు రైతుల సమస్యలు పరిష్కరించాలని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి సనపల నారాయణరావు అధికారులను కోరారు. గురువారం నారాయణపురం కుడికాలువ, ప్రారంభంలో ఆయకట్టు పరిస్థితిని పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధుల బృందం పరిశీలించింది. సంతకవిటి, పొందూరు, ఎచ్చెర్ల మండలాల్లో కాలువ పరిస్థితిపై ఆరా తీశారు. ఈ సందర్భంగా వీరు మాట్లాడుతూ గత ఖరీఫ్‌లో ఐదు వేల ఎకరాల్లో పంట కోల్పోయామని, వచ్చే ఖరీఫ్ నాటికైనా సమస్య పరిష్కరించాలని కోరారు. 50 కిలోమీటర్లు విస్తరించి ఉన్న కాలువకు మరమ్మతులు, కాంక్రీట్ లైనింగ్ పనులు, ప్రాజెక్టు సమీపంలో నీటి నిల్వ సామర్థ్యం పెంచటం, బాడీవాల్ నిర్మాణం, పూడికల తొలగింపు, షట్టర్లు ఏర్పాటు వంటి పనులు పూర్తి చేస్తేనే సాగునీరు అందుతుందని చెప్పారు. ఫరీదుపేట, ఇబ్రహింబాద్, పూడివలస, తమ్మినాయుడుపేట, కుశాలపురం, తోటపాలేం, పొన్నాడ, కొంగరాం, కొత్తపేట, బొంతలకోడూరు, ముద్దాడ, భగీరథపురం గ్రామాల రైతులు సాగునీటికి ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. సకాలంలో సాగునీరు అందజేయకపోతే ఈ ప్రాంతంలో వ్యవసాయానికి భవిష్యత్తు ఉండదని ఆందోళన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో నాయకులు, ప్రజాప్రతినిధులు పైడి వెంకన్నగారిశ్రీను, బెండు రామారావు, ముద్దాడ శంకర్, జరుగుళ్ల కృష్ణారావు, సూర అప్పారావు, సీపాన ఎర్రన్నాయుడు, అల్లు సూర్యనారాయణ, సీపాన పూర్ణచంద్రరావు, సనపల సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

పెన్షన్ సవరణ బిల్లు ఉపసంహరించుకోవాలి



పోస్టాఫీసు వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న పెన్షనర్లు

శ్రీకాకుళం అర్బన్: కేంద్ర ప్రభుత్వ పెన్షనర్స్ పే రివిజన్ సవరణ బిల్లును తక్షణమే ఉపసంహరించాలని జిల్లా కేంద్ర ప్రభుత్వ పెన్షనర్ అసోసియేషన్, నేషనల్ కో–ఆర్డినేషన్ కమిటీ ఆఫ్ పెన్షనర్స్ అసోసియేషన్ ప్రతినిధులు డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం శ్రీకాకుళంలోని ప్రధాన తపాలా కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేశారు. ఈ మేరకు అసోసియేషన్ కన్వీనర్ కంబాల చంద్రశేఖర్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ పెన్షనర్ల హక్కులను హరించే సి.సి.ఎస్.పెన్షన్ రూల్స్ సవరణ బిల్లును వెనక్కు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం పోస్ట్‌మాస్టర్‌కి మెమొరాండం అందజేసి ప్రధానమంత్రికి పంపించాలని కోరారు.

కార్యక్రమంలో సంఘ ప్రతినిధులు కె.వెంకటరావు, కె.చంద్రశేఖర్, డి.జోగారావు, ఎస్.రమేష్, కె.సూరయ్య, ఎం.ఆదినారాయణమూర్తి, జి.భాస్కరరావు, గోవర్దన్, కె.పూర్ణచంద్రరావు, పి.మురళీధరరావు, కిల్లి వెంకటరమణమూర్తి, సీహెచ్ రామారావు తదితరులు పాల్గొన్నారు.

బీఎస్ఎన్ఎల్ పెన్షనర్ల ఆందోళన



సంచార భవన్ వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న పెన్షనర్లు

శ్రీకాకుళం అర్బన్: భారత సంచార నిగమ్ లిమిటెడ్‌లో 30 నుంచి 40 ఏళ్లుగా ప్రజలకు సేవలందించిన పెన్షనర్లకు సంబంధించి పెన్షన్ రివిజన్ చేయకుండా ఉండేందుకు పార్లమెంట్, రాజ్యసభలో ఏకపక్షంగా పెన్షన్ సవరణ బిల్లును ఆమోదించడం దుర్మార్గమని ఆలిండియా బీఎస్ఎన్ఎల్ పెన్షనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు ధ్వజమెత్తారు. ఈ మేరకు గురువారం దేశవ్యాప్తంగా పెన్షనర్లు నిరసన ప్రదర్శన చేపట్టారు. ఈ సందర్భంగా సంఘ ప్రతినిధులు మాట్లాడుతూ కేంద్రప్రభుత్వం మార్చి 25, 27వ తేదీలలో ఆమోదించిన పెన్షన్ సవరణ బిల్లుకు వ్యతిరేకంగా గురువారం అన్ని కేంద్ర కార్యాలయాల వద్ద నిరసన ప్రదర్శనలు నిర్వహించినట్లు చెప్పారు. పార్లమెంట్ సభ్యుల పారితోషకాన్ని ఏవిధమైన చర్చ జరపకుండానే ఏకపక్ష నిర్ణయంతో పెంచుకున్నారని దుయ్యబట్టారు. 30 నుంచి 40 ఏళ్లుగా సేవలందించిన పెన్షనర్లకు మాత్రం పెన్షన్ రివిజన్ ఎగనామం పెట్టడానికి బిల్లును ఆమోదించడం అన్యాయమన్నారు. ఈ బిల్లును తక్షణమే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు.

లేనిపక్షంలో పోరాటం ఉద్ధతం చేస్తామని హెచ్చరించారు. నిరసన ప్రదర్శనలో పెన్షనర్ సంఘ నాయకులు ప్రసాదరావు, వెంకటరావు పాణిగ్రాహి, మన్మధరావు, ఎం.వి.రామారావు, ఎం.గోవర్దనరావు, కె.గోపాలరావు, హెచ్.ఢిల్లీశ్వరరావు, పి.వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

డేటా ఎంట్రీ ఆపరేటర్ పోస్టు భర్తీ ప్రక్రియ నిలిపివేత

శ్రీకాకుళం పాతబస్టాండ్: జిల్లా పౌర సరఫరాల శాఖ ఆధ్వర్యంలో నిత్యావసర వస్తువుల ధరల నియంత్రణ విభాగంలో డేటా ఎంట్రీ ఆపరేటర్ పోస్టు భర్తీ ప్రక్రియను నిలిపివేస్తున్నట్లు జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. గత నెల 26న విడుదలైన ప్రకటనలో ఈ పోస్టును తాత్కాలిక ప్రాతిపదికన భర్తీ చేయనున్నట్లు, శ్రీకాకుళం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని నిరుద్యోగ అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నానమని, అయితే, పరిపాలనా కారణాల దృష్ట్యా ఈ ప్రక్రియను నిలిపివేస్తున్నట్లు చెప్పారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

గార: మండలంలోని చల్లపేట సబ్‌స్టేషన్ వద్ద బ్రేకర్ మరమ్మతుల నేపథ్యంలో శుక్రవారం ఉదయం 8 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఈపీడీసీఎల్ ఈఈ పైడి యోగీశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. శ్రీకూర్మం, అంపోలు, వాడాడ, గొంటి, బలరాంపురం, వత్సవలస, రామచంద్రాపురం తదితర పంచాయతీల పరిధిలోని మిల్లర్లు, త్రీఫేజ్ వాడుతున్న రైతులు, గృహ వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

ఎచ్చెర్ల క్యాంపస్: సబ్ స్టేషన్, విద్యుత్ లైన్ల నిర్వహణ నేపథ్యంలో ఎచ్చెర్ల మండల హెడ్ క్వార్టర్, ఎచ్చెర్ల పంచాయతీ, కొయ్యాం, నిమ్మవానిపేట, కొత్తవానిపేట, బడివానిపేట, అజ్జరాం గ్రామాల్లో శుక్రవారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ కోత విధిస్తున్నట్లు ఈఈ తెలిపారు.

మజ్జిగ ప్యాకెట్ల వితరణ



మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ చేస్తున్న దృశ్యం

శ్రీకాకుళం కల్చరల్: నగరంలోని విశాఖ–ఏ కాలనీ షిరిడీసాయి దేవాలయంలో గురువారం నిర్వహించిన అన్నదాన కార్యక్రమానికి జిల్ ఫౌండేషన్ ప్రతినిధులు మజ్జిగ ప్యాకెట్లు వితరణ చేశారు. కార్యక్రమంలో జాడ సాయి, ఏబీవీపీ అధ్యక్షులు గోపి, సుదర్శన్, ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

వినియోగదారుల కమిషన్ చైర్మన్‌ను కలిసిన బార్ కార్యవర్గం



రఘుపాత్రుని చిరంజీవిని కలిసిన కార్యవర్గ ప్రతినిధులు

శ్రీకాకుళం పాతబస్టాండ్: వినియోగదారుల కమిషన్ చైర్మన్ రఘుపాత్రుని చిరంజీవి, సభ్యులు జి.రాధారాణి, సీహెచ్ షణ్ముఖరావులను ఇటీవల ఎన్నికైన శ్రీకాకుళం బార్ అసోసియేషన్ కార్యవర్గ ప్రతినిధులు గురువారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా బార్ అసోసియేషన్ అధ్యక్షుడు తంగి శివప్రసాదరావు, ప్రధాన కార్యదర్శి పిట్టా దామోదరరావు, కార్యవర్గ సభ్యులు ఇప్పిలి శీతరాజు, గురుగుబెల్లి వరజాక్షిలు మాట్లాడుతూ జిల్లా కోర్టు ప్రాంగణంలో కన్జుమర్ కోర్టు లేక న్యాయవాదులు ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. భవన నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని కోరారు.

ఘనంగా ఆలయ ప్రతిష్టాపనోత్సవం



బడివానిపేట పంచాయతీ జాలారు కొయ్యాం గ్రామంలో గురువారం సీతారాములు ఆలయ ప్రతిష్టాపన ఘనంగా నిర్వహించారు. మధ్యాహ్నం అన్న సమారాధన ఏర్పాటు చేశారు. మాజీ ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. సర్పంచ్ కారి తాతారావు, వైఎస్సార్ సీపీ మండల పార్టీ అధ్యక్షులు బోర సాయిరాం, నాయకులు, గ్రామపెద్దలు నక్క కృష్ణ మూర్తి, వారధి ఎర్రయ్య తదితరులు పాల్గొన్నారు. – ఎచ్చెర్ల క్యాంపస్

నిత్యావసర సరుకుల వితరణ



పీఎన్ కాలనీలోని వరసిద్ధి వినాయక పంచాయతన ఆలయం వద్ద కరకవలస సంతోష్‌సాగర్‌కు గురువారం నిత్యావసర సరుకులు అందజేశారు. ప్రైవేటు స్కూల్‌లో టీచర్‌గా పనిచేస్తున్న ఈయన ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడి ఇంటికే పరిమితమయ్యారు. విషయం తెలుసుకున్న నగరానికి చెందిన సుసరాపు శ్రీలత, దాసరి రవికుమార్, స్టేట్ బ్యాంకు అసోసియేట్ నల్ల గౌతమిలు మూడు నెలలకు సరిపడా సరుకులు, 26 కేజీల బియ్యం, నగదు అందించారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ చైర్మన్ పి.జగన్మోహనరావు, సేవకులు ఉర్లం శివతేజ, తదితరులు పాల్గొన్నారు. – శ్రీకాకుళం కల్చరల్

సాయీ శరణం..బాబా శరణం



శ్రీకాకుళం నగరంలోని మొండేటివీధి షిరిడీసాయి బాబా మందిరంలో గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు స్వామివారికి మూడు హారతులు, అభిషేకాలు చేశారు. పెద్ద ఎత్తున భక్తులు తరలి వచ్చి స్వామివారిని దర్శించుకున్నారు.

– శ్రీకాకుళం కల్చరల్

రాత్రి 11 తర్వాత సంచరిస్తే చర్యలు

- డీఎస్పీ వివేకానంద

శ్రీకాకుళం క్రైమ్ : శ్రీకాకుళం సబ్ డివిజన్ పరిధిలో అకారణంగా రాత్రి 11 గంటల తర్వాత సంచరిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని డీఎస్పీ సీహెచ్ వివేకానంద హెచ్చరించారు. ఈ మేరకు గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. నేరనియంత్రణా చర్యల్లో భాగంగా ఎస్పీ కె.వి.మహేశ్వరరెడ్డి ఆదేశాల మేరకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. అర్ధరాత్రుళ్లు అనవసరంగా తిరగరాదని, రాత్రి 11 తర్వాత వ్యాపారాలు సాగించరాదని, షాపులు, టిఫిన్‌బళ్లు మూసివేయాలని స్పష్టం చేశారు. బహిరంగ ప్రదేశాల్లో యువత సంచరించినా టౌన్ న్యూసెన్సు చట్టం ప్రకారం కేసులు నమోదు చేస్తామని, వారి తల్లిదండ్రులను స్టేషన్లకు పిలిపించి కౌన్సిలింగ్ ఇస్తామని చెప్పారు.

కండక్టర్ సస్పెన్షన్ రద్దు చేయాలి



ధర్నా చేస్తున్న ఈయూ నాయకులు, ఆర్టీసీ ఉద్యోగులు

శ్రీకాకుళం అర్బన్: పలాస డిపో పరిధిలో ఎస్.నీలకంఠం అనే కండక్టర్‌ను అన్యాయంగా సస్పెండ్ చేశారని, తక్షణం సస్పెన్షన్ రద్దు చేసి తిరిగి విధుల్లోకి తీసుకోవాలని ఆర్టీసీ ఎంప్లాయీస్ యూనియన్ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు శ్రీకాకుళం ఆర్టీసీ కాంప్లెక్స్ ఆవరణలో గురువారం ఈయూ ఆధ్వర్యంలో గేట్ మీటింగ్, ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా యూనియన్ రాష్ట్ర కార్యదర్శి పి.నానాజీ మాట్లాడుతూ నీలకంఠంను విధుల్లోకి తీసుకోకుంటే రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళన చేపడతామని హెచ్చరించారు. 1/19 సర్క్యులర్‌ను అధికారులు అమలు చేయకుండా ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. శ్రీకాకుళం రెండో డిపో పరిధిలో మేనేజర్ శర్మ ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించడం లేదన్నారు. డ్రైవర్, కండక్టర్ చార్టులు వేయడం లేదని, అక్రమ చార్జిషీట్‌లు, అక్రమ డెబిట్‌లు ఇస్తున్నారని చెప్పారు. కేఎంపీఎల్‌పై వేధింపులు చేస్తున్నారని, ఉద్యోగులపై కక్షసాధింపు చర్యలు వీడాలని కోరారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు ఎస్.వి.రమణ, బి.రామకృష్ణ, కె.బాబూరావు, సీహెచ్.బాబు, బి.ఆనందరావు, ఎ.సింహాచలం, ఎస్.లక్ష్మణరావు, ఎస్ఎస్ నారాయణ, ఎస్.రమణ, పి.కె.రావు, ఎ.వి.ఆర్.మూర్తి తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీల పనితీరు మెరుగుపడాలి



సమావేశంలో మట్లాడుతున్న పీవో పాపినాయుడు

ఎచ్చెర్ల క్యాంపస్: అంగన్‌వాడీ కేంద్రాల పనితీరు మెరుగు పడాలని ఎచ్చెర్ల ఐసీడీఎస్ ప్రాజెక్టు డైరెక్టర్ డి.పాపినాయుడు అన్నారు. ఎచ్చెర్ల మండల పరిషత్ సమావేశ మందిరంలో గురువారం అంగన్‌వాడీ కేంద్రాలు సేవలు, పూర్వపు ప్రాథమిక విద్య, బాల సంజీవని యాప్ వినియోగం, పౌష్టికాహారం తదితర అంశాలపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంగన్‌వాడీ కార్యకర్తలు రోజు వారీ విధులు, ఇతర అంశాలు బాల సంజీవిని యాప్‌లో డౌన్‌లోడ్ చేయాలన్నారు. ఐదేళ్లలోపు చిన్నారులకు పూర్వ ప్రాథమిక విద్య అందాలని చెప్పారు. అర్హులందరికీ పౌష్టికాహారం అందించాలని సూచించారు. సమావేశంలో సూపర్‌వైజర్లు శరణ్య, లక్ష్మి, అరుణ తదితరులు పాల్గొన్నారు.

వేతనాలు పెంచాలి..

అంగన్‌వాడీ కార్యకర్తలకు వేతనం పెంచాలని పలువురు సిబ్బంది కోరారు. బాల సంజీవని యాప్‌ను తాము వినియోగించలేదని, ఇంటర్నెట్ సమస్య కారణంగా ఫొటోల అప్‌లోడ్ సాధ్యం కాదని చెప్పారు. సెల్ ఫోన్‌లు లేని, వినియోగం తెలియని హెల్పర్లు ఎఫ్ఏసీ ఎలా వినియోగిస్తారని అధికారులకు విన్నవించారు.